క్లుప్తంగా

దళిత సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్టాలిన్



స్టాలిన్‌ను సన్మానిస్తున్న దళిత నాయకులు

లింగపాలెం: దళిత సేన ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సికాకొల్లు స్టాలిన్ నియమితులయ్యారు. మండలంలోని సింగగూడెంలో జరిగిన దళిత సేన కార్యకర్తల సమావేశంలో దళిత సేన ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్క పాము చంటి స్టాలిన్‌కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు స్టాలిన్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశంలో దళిత సేన ఏలూరు జిల్లా కార్యదర్శి పింగల ఇదియా, లింగపాలెం మండల బీసీ సెల్ అధ్యక్షుడు కొప్పుల నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

లింగపాలెం: క్షేత్రస్థాయిలో గ్రామాల అభివృద్ధి చెందాలంటే, గ్రామాలు ప్రగతి పథంలో నడవాలంటే స్థానిక ప్రజా ప్రతినిధుల కృషి ఎనలేనిదని లింగపాలెం ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం లింగపాలెం మండల పరిషత్ సర్వసభ సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మట్ట సురేష్, ఎంపీడీవో కే వాణి, తహసిల్దార్ నజీమ్, ప్రజా ప్రతినిధులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: నాటుసారా స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ కృష్ణబాబు, లక్కవరం ఎస్సై రామకృష్ణతో కలిసి మండలంలోని పంగిడిగూడెంలో నాటు సారా స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు లక్కవరం ఎస్సై రామకృష్ణ తెలిపారు. అలాగే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

చింతలపూడి: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ ఎం.రవీంద్రనాయక్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని లారీ ఓనర్స్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. చట్టానికి లోబడే పట్టణంలో లోడింగ్, అన్‌లోడింగులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు యు.మూర్తి, యు.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెట్టలో పొగాకు సాగు ప్రారంభం

జిల్లాలోనే లింగపాలెం నాటు పొగాకుకు ప్రసిద్ధి



లింగపాలెం మండలంలో నాటు పొగాకు నారు మడులు

లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో నాటు పొగాకు పంట సాగు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాటు పొగాకు నారు మడులు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారని రైతులు ఆవేదన చెందుతున్నారు. నేడు తోటలు సాగు చేసేందుకు కొన్ని గ్రామాల్లో నారు కొరత ఏర్పడింది. దీంతో నారుకు డిమాండ్ పెరిగింది. జిల్లాలోనే ఈ మండలంలో నాటు పొగాకు పండించటంలో రైతులు ఎంతో ప్రసిద్ధి చెందారు.

కంటికి రెప్పలా కాపాడుకోవాలి

ఈ పంటను పండించాలంటే రైతులకు రిస్కుతో కూడిన వ్యవహారం. ఈ పంట పూర్తి అయ్యే వరకు కంటికి రెప్పలా చూసుకోవాలి. నీరు తక్కువతో ఈ నాటు పొగాకు సాగు పూర్తవుతుంది. ఈ ప్రాంతంలో నీటి సమస్య కారణంగా రైతులు మండలంలోని కె.గోకవరం, ములగలంపాడు, రంగాపురం, కొత్తపల్లి, నరసన్నపాలెం, మఠంగూడెం, తోచలకరాయుడుపాలెం, పుప్పాలవారిగూడెం, కొణిజర్ల తదితర గ్రామాల్లో ఈ నాటు పొగాకును రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. ఈ నెలాఖరు వరకు ఈ తోటలు వేసేందుకు అనువుగా ఉంటుందని రైతులు తెలిపారు. గత ఏడాది వైరస్ తెగుళ్ల వ్యాపించి దిగుబడులు తగ్గిపోయాయన్నారు. గత ఏడాది మండలంలో 3,010 ఎకరాల్లో ఈ నాటు పొగాకు పంటను రైతులు సాగు చేయగా ఈ ఏడాది 3,200 ఎకరాల్లో పైగా నాటు పొగాకు వేసేందుకు రైతులు నారుమళ్లు వేశారు. ఈ ఏడాది మరో 190 ఎకరాల్లో నాటు పొగాకు పంటను అదనంగా సాగు చేయనున్నట్లు రైతులు తెలిపారు. ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుందని వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే పంట బాగా పండితే 4 నుంచి 5 పుట్ల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఈ పంట 120 రోజులకు చేతికి అందుతుందన్నారు. ఇక్కడ పండిన పొగాకును గుంటూరు, విజయవాడుకు చెందిన వ్యాపారులు వచ్చి పెద్ద ఎత్తున్న రైతుల నుంచి కొనుగోలు చేసుకుని లారీలపై ఎగుమతులు చేసుకుని వెళతారు. నాటు పొగాకుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

తక్కువ నీటితో పండే పంట



మెట్ట ప్రాంతంలో రబీలో సాగు చేసేందుకు నీటి సమస్య కారణంగా తక్కువ నీరుతో పండే నాటు పొగాకు పంటను సాగు చేస్తున్నాం. పంటను సాగు చేసిన దగ్గర నుంచి చేతికి అంది వచ్చే వరకు కంటికి రెప్పలా చూసుకోవాలి. గత ఏడాది నాటు పొగాకు ధర సక్రమంగా లేదు. ఈ ఏడాది ప్రభుత్వం నాటు పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి.

రెడ్డిన శ్రీను, రైతు, రంగాపురం

మద్ది అంజన్నకు లక్ష తమలపాకుల పూజ



లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువుగా వెలసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రాతః కాలార్చన, తోమాలసేవ, గోపూజ, నిత్య హోమబలిహరణలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. నిత్య హోమబలిహరణలు, నీరాజన మంత్రపుష్పములు, దర్బారు సేవ, చతుర్వేదాధ్యయనం, ప్రసాద వితరణ నిర్వహించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి, సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ కృష్ణబాబు

జంగారెడ్డిగూడెం: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం సీఐ వి.కృష్ణబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం పలు కూడళ్లు, ప్రాంతాల్లో ఐడీ పార్టీ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతియుత వాతావరణానికి భంగం కలిగించేలా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పట్టణంలోని చీకటి ప్రాంతాలు, నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు రాజశేఖర్, సత్యనారాయణ, హెచ్‌జీ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు వెంకటేష్

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఒక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిరుమలంపాలేనికి చెందిన ఇందేటి వెంకటేష్ గురువారం సాయంత్రం ద్వారకాతిరుమలలో పనులు ముగించుకుని తన బైక్‌పై స్వగ్రామానికి వెళుతున్నాడు. మార్గ మధ్యంలోని తిమ్మాపురం పెట్రోల్ బంకులోకి వెళుతున్న సమయంలో అతడి బైక్‌ను, ద్వారకాతిరుమల నుంచి భీమడోలు వైపుకు వెళుతున్న ఒక కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన వెంకటేష్‌ను స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై సుధీకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

జంగారెడ్డిగూడెం: దేశ ప్రజల జీవన విధానాలు దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ పిలుపునిచ్చారు. నవంబర్ 1 నుంచి 9 వరకు జరుగుతున్న అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో ఎం.శ్రీను అధ్యక్షతన అమరవీరుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ మాట్లాడుతూ నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలంటే పోరాటాల ద్వారానే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కె.రామలక్ష్మి, గంపల వెంకటేష్, ముప్పిడి అబ్బులు, దుర్గారావు, పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో విద్యార్థినుల సందడి



వృద్ధులతో హైస్కూల్ విద్యార్థినులు

కొయ్యలగూడెం: కల్పవృక్షం వృద్ధాశ్రమంలో పరింపూడి జెడ్పీ హైస్కూల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సేవా కార్యక్రమం నిర్వహించి, సందడి చేశారు. శుక్రవారం హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.ఉమాదేవి ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్వీస్ టు కమ్యూనిటీస్‌లో భాగంగా ఆశ్రమ వృద్ధులతో కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు ఎదుట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. వారితో గ్రూప్ ఫోటో షేర్ చేసుకుని వారిలో ఆనందాన్ని నింపారు. దుర్గారాణి, విశ్వనాథ శాస్త్రి, మాజేటి అప్పలరాజు, దారం సత్తిరాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: మండలంలోని పంతంగులగూడెం గ్రామంలో సారా తయారీ కేంద్రంపై చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో హసావత్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వెంకన్నలపై పరారీ కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహరావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తి మృతిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంకు చెందిన ఉప్పల శ్రీనివాస్ (47) ఈ నెల 6వ తేదీన మోటార్‌సైకిల్ ఫైనాన్స్ డబ్బులు కట్టడానికి జంగారెడ్డిగూడెం వచ్చాడని, సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి ట్రాక్టర్ తీసుకొస్తున్నానని, లేటు అవుతున్నందున ఇంటికి రావడం లేదని తెలిపాడన్నారు. అయితే 7వ తేదీ సాయంత్రం శ్రీనివాస్ మొబైల్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి శ్రీనివాస్ భార్య లీలావతికి ఫోన్ చేసి వేగవరం గ్రామం పొగాకు మొద్దుల ఫ్యాక్టరీ సమీపంలో గ్యాస్ నొప్పితో శ్రీనివాస్ పడిపోయాడని తెలిపాడన్నారు. వెంటనే లీలావతి కుమారుడితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోగా, శ్రీనివాస్ విగత జీవుడిగా కనిపించాడన్నారు. ఈ మేరకు లీలావతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు. కాగా శ్రీనివాస్‌కు గ్యాస్ నొప్పి సమస్య ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు హెచ్‌సీ తెలిపారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన చిన్నబోయిన నూకమ్మ, ఆమె భర్త జగ్గయ్య రెండు నెలల క్రితం కూలీ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లారన్నారు. ఈ నెల 6వ తేదీన నూకమ్మ ఇంటి తాళాలు పగుల గొట్టి ఉన్నాయని, పక్కింటి వారు ఫోన్ చేసి చెప్పడంతో, నూకమ్మ భర్తతో కలిసి జంగారెడ్డిగూడెం వచ్చిందన్నారు. ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉండటం చూసి లోపలికి వెళ్లి చూడగా, ఇంట్లోని రెండు గ్యాస్ బండలు, గ్యాస్‌స్టౌ, మరికొన్ని సామాగ్రి కనిపించ లేదన్నారు. దీంతో గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారని గుర్తించి, నూకమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో కార్తీక తొలి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి అర్చకులు ఆధ్వర్యంలో ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మహామంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో 69వ చండీహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమరవీరుల ఆశయ సాధనకు పోరాడదాం



సభలో మాట్లాడుతున్న నాయకులు

బుట్టాయగూడెం: అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాడదామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ధర్మల సురేష్ అన్నారు. మండలంలోని గురుగుమిల్లిలో శుక్రవారం అమరవీరుల సంస్మరణ సభ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజనులను తీవ్రంగా మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చట్టాలను కాలరాస్తున్నాయని అన్నారు. 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు కారం రాఘవ, ఎస్.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సమాజంలో ప్రజలు అసమానతలతో జీవిస్తున్నారన్నారు. ప్రజల అసమానతలు పోవాలంటే పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు కెచ్చెల పోతురెడ్డి, తగరం బాబూరావు, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజు, సర్పంచ్ కారం లక్ష్మి, మాజీ సర్పంచ్ పట్ల చిన్నయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

పోలవరం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీఎస్‌వీఆర్ఎల్ రాజు తెలిపారు. మండలంలోని గూటలా–1 రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు ఇచ్చి మోసపోవద్దని ధాన్యం కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలని సూచించారు. ఖరీఫ్ 2024–25 సీజన్‌కు సంబంధించి క్వింటాల్‌కు కామన్ రకం రూ.2300, గ్రేడ్–1 రకం రూ.2320 ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతులు తేమ శాతం 17 శాతం లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

18న గ్రామ సచివాలయాల వద్ద ధర్నాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేత

కామవరపుకోట: ఈ నెల 18న గ్రామ సచివాలయాల ముందు జరిగే ధర్నాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం కామవరపుకోటలో నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వాలను అడుక్కోవద్దని, పోరాటాల్లో కలిసి రావాలని రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, అందుకే పేదలు సాగు భూములు, ఇళ్ల స్థలాలకు దూరం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, గోలిమి బాలయేసు, సంఘం సీనియర్ నాయకులు బోడ వజ్రం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గురువయ్య, టీడీఎస్ రాజు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయం వద్ద వీఓఏల ఆందోళన



కొయ్యలగూడెం: వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు




లింగపాలెం: ధర్నా చేస్తున్న వీఓఏలు

కొయ్యలగూడెం: కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని శుక్రవారం వీవోఏలు ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలోని పరింపుడిలోని వెలుగు కార్యాలయం వద్ద వీవోఏలు ధర్నా చేపట్టారు. వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు ఎం.సావిత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం ఏపీఎం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సుభాషిణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు, ఎం.సత్యవతి, ఎస్‌కే రజియా, బి.వెంకటలక్ష్మి, బి.జయమణి, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం లింగపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీవోఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నత్త వెంకటేశ్వరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెలుగు వీవోఏలపై రాజకీయ పార్టీ నాయకులు కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్.మేరీ, ఎస్.విజయ్ కుమారి, శ్రావణి, ఎస్.మరియమ్మ, రేణుక పాల్గొన్నారు.

ఘనంగా న్యాయ సేవా దినోత్సవం



ఉచిత న్యాయ సహాయం గురించి వివరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

జంగారెడ్డిగూడెం: ప్రతీ పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో మండలం న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో న్యాయ వ్యవస్థకు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం నవంబర్ 9వ తేదీన న్యాయ సేవా దినోత్సవం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ విత్తనాల రాజు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి: సమాజంలోని పేద, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడానికి లీగల్ సర్వీసెస్ అథారిటీస్ రూపొందించినట్లు జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు తెలిపారు. శుక్రవారం కోర్టు ఆవరణలో జాతీయ న్యాయ సేవల దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామ సభల అర్జీలను పరిష్కరించండి

కొయ్యలగూడెం: గ్రామ సభల్లో ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి రెవెన్యూ శాఖ కృషి చేయాలని సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ఏలేటి చిన్న తొక్కయ్య కోరారు. రాజవరం గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ కె.చంద్రన్న దొర ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించగా సర్పంచ్ హోదాలో ఆయన పాల్గొన్నారు. భూ సమస్యల బాధలతో ఎక్కువ మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సాంకేతిక సమస్యల వలన కొంతమేర జాప్యం కలుగుతుందన్నారు. గ్రామసభల్లో మొత్తం 210 దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మణి దివ్య తెలిపారు. గ్రామ కార్యదర్శి పి.రామచంద్రరావు, వీఆర్‌వో సాత్విక, సర్వేయర్ విజయ భార్గవి, రాజవరం రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.